క్లుప్తంగా

వైఎస్సార్ జయంతికి ఏర్పాట్లు

పరవాడ:మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75 జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. అదే రోజు వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. పరవాడ సంతబయలులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించి పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. మండలంలో ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

రాయితీ విత్తనాల అందజేత



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం:ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. గుల్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఆమె చేతులమీదుగా శనివారం రాయితీపై వరి విత్తనాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలు,సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సీజన్ కాని సమయంలో అపరాలు, నీటి ఎద్దడి తట్టుకునే పంట రకాలను వేసుకోవాలని సూచించారు. సోనామసూరి,సాంబమసూరి,ఆర్‌జీఎల్ రకాల విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జి దేముడు,గ్రామ పెద్దలు బండారు శ్రీను,బోకం నారాయణమూర్తి, రాంబాబు,పంచాయతీ కార్యదర్శి బ్రహ్మ, వ్యవసాయ సహాయకురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మీ దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న జేసీబీ ప్రసాద్

పెందుర్తి: అక్షర భారత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు భారీ ఎత్తున నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని సరిపల్లి, నీలకంఠపురం, గుర్రంపాలెం, పెందుర్తి, గొల్లనారాయణపురం పాఠశాలల్లోని దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు ట్రస్ట్ వ్యవస్థాపకుడు నెల్లూరు ప్రసాద్(జేసీబీ ప్రసాద్) తన సొంత నిధులతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఇతర సామగ్రి అందించారు. పదో తరగతిలో తన స్వగ్రామం సరిపల్లి పాఠశాలలో మొదటిస్థానం పొందిన వారికి రూ.20 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.15 వేలు, తృతీయ స్థానం పొందిన వారికి రూ.10 వేలు అందిస్తున్నామని చెప్పారు.

పరిశుభ్రతతో డయేరియాకు చెక్

• డాక్టర్ జయశ్రీ కరిష్మా



అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సంతబయలులో మానవహారంగా ఏర్పడిన వైద్య సిబ్బంది, విద్యార్థులు

పరవాడ: డయేరియా వ్యాధి ప్రబలకుండా ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ కరిష్మా సూచించారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం పరవాడలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయశ్రీకరిష్మా మాట్లాడుతూ డయేరియా వ్యాధి ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. బిడ్డకు పాలు ఇచ్చే ముందు, మల విసర్జన తర్వాత, భోజనానికి ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో ఈగలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు అతిసార నియంత్రణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అతిసార వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి సమాచారం అందిస్తే వెంటనే వారికి వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. ముందుగా వైద్య సిబ్బంది, విద్యార్థులు కలిసి గ్రామంలో అతిసార వ్యాధి నివారణపై ర్యాలీ నిర్వహించారు. సంతబయలులో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ జానకీరామన్, సూపర్‌వైజర్ పి.వి.రత్నం, సీహెచ్. ఇందిర, ఎంపీహెచ్‌ఏఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

అప్పన్న సన్నిధిలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్



మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరంపూజ నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపిక, శేషవస్త్రాలను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు గిరి తదితరులు కల్యాణం నిర్వహించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరం పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

క్రమశిక్షణతో సేవా కార్యక్రమాలు



వాకర్స్ క్లబ్ సభ్యులకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న కమల్ బైద్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి విస్తృత సేవా కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలుస్తున్నారని వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో కమల్ బైద్ ప్రశంసించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం వాకర్స్ పార్కులో క్లబ్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో ఈ క్లబ్ ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ జూలై నెల సంచికను ఆయన ఆవిష్కరించారు. 91వ వసంతంలోకి అడుగు పెట్టిన క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, ఈ ఏడాది 90వ వసంతంలోకి అడుగు పెడుతున్న పూర్వ అధ్యక్షులు కేజీ కృష్ణారావు, రాళ్లపల్లి సత్యనాథం చేసిన సేవా కార్యక్రమాలను సభ్యులకు పల్లా చంద్రమౌళి తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవన నిర్మాణానికి తొలిసారిగా వాకర్స్ క్లబ్ సభ్యుల తరపున లక్ష రూపాయల విరాళాన్ని అందించినట్లు చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులకు వాకర్స్ నియమావళి తెలియచేసి ప్రమాణ స్వీకారం చేయించారు. కమల్ బైద్‌ను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగ్‌లు సభ్యులకు పంపిణీ చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, క్లబ్ కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, పూర్వాధ్యక్షులు సిహెచ్.కృష్ణమూర్తి, ఎం.భాస్కరరావు, సత్తి సునీల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు జి.విజయలక్ష్మి, వి.అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, వై.దేముడు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఎస్.రామ్మోహనరావు, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితా రెడ్డి, ఓం వాకర్స్ అధ్యక్షురాలు వి.ప్రమీల పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..

• సీఐ బాలసూర్యారావు



బాలసూర్యారావు

పరవాడ: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. నిత్యం ఏదో ఒక చోట జరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి వాహనచోదకుడు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అతివేగం ప్రమాదకరమనే విషయాన్ని వాహనచోదకులు గుర్తించాలన్నారు. వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనదారుడు ఇన్సూరెన్స్, లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ బాలసూర్యారావు సూచించారు.

వైభవుడికి సుప్రభాత సేవ




ఆలయ ప్రదక్షిణలో అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో శిబిరాన్ని నిర్వహిస్తారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు సేవలందిస్తారు.

ఐఐపీఈ నిర్మాణ పనుల పరిశీలన



వర్సిటీ నమూనాను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేష్

సబ్బవరం: మండలంలోని వంగలిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) సంస్థ రెండో దశ భవన నిర్మాణ పనులను శనివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పరిశీలించారు.సంస్థ జనరల్ మేనేజర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.త్వరితగతిన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఎంపీ తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆర్థిక అభివృద్ధి కూడా సాధ్యమవుతుందని ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఆయన వెంట నాయకులు, అధికారులు ఉన్నారు.

సాంకేతికతతో ముందంజ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: ప్రస్తుతం సాంకేతిక రంగంలో ప్రతిభ కనబరిచిన వారు ముందంజ వేస్తున్నారని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. శనివారం కళాశాలలో 'మనిషి దైనందిత జీవనంలో సైన్స్ టెక్నాలజీ ప్రభావం' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పోటీల్లో దివ్య కీర్తి మొదటిస్థానంలో, ద్వితీయ స్థానంలో ఎస్.జశ్వంత్, బి.యామిని , తృతీయస్థానంలో ఎస్‌వీఎస్ తరుణ్‌కుమార్, పి.అఖిల్ ఆదిత్య, కె.శేఖర్ నిలిచారు. చరణ్, యశస్విని, తేజశ్రీ, సురేఖ పర్విన్, కృష్ణ మోహన్, అంజలి, రాజశేఖర్, గణేష్‌కు ప్రత్యేక బహుమతులు అందించారు. అతిథిగా నేవల్ డాక్‌యార్డ్ అధికారి జి.వరప్రసాద్ వచ్చారు. న్యాయ నిర్ణేతలుగా గోపాలరావు, శ్రీకాంత్ వ్యవహరించారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు



ఆరిపాక లో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్వర్ణలత



పెంపుడు కుక్కకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రామకృష్ణకీర్తి



పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యుడు

పరవాడ: మండలంలోని పరవాడ, లంకెలపాలెం, వాడచీపురుపల్లి పశువైద్యశాలల్లో పశు సంవర్థకశాఖ ఏడీ రామకృష్ణ కీర్తి పర్యవేక్షణలో ప్రపంచ జూనోసిస్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. వాటి యజమానులకు జూనోటిక్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ రామకృష్ణకీర్తి మాట్లాడుతూ ఇళ్లలో పెంచుకొనే పెంపుడు జంతువులు కుక్కలు, పిల్లులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. అలాగే పెంపుడు జంతువులకు చిన్న పిల్లలు ముద్దులు పెట్టడడం, తాకడం వంటివి చేయకూడదని సూచించారు. కార్యక్రమంలో వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశువైద్యశాలల వైద్యాధికారులు డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ అశ్విని, సిబ్బంది కల్యాణి, కృష్ణ, లక్ష్మణ, సంతోషి, అప్పారావు పాల్గొన్నారు.

సబ్బవరంలో 22 పెంపుడు కుక్కలకు..

సబ్బవరం: ప్రపంచ సంక్రమిత వ్యాధుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని పలు పశు వైద్యశాల్లో పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా టీకాలు వేశారు. ఆరిపాక వెటర్నరీ డిస్పెన్సరీలో 22 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆరిపాక పశువైద్యాధికారి డాక్టర్ స్వర్ణలత,వెటర్నరీ అసిస్టెంట్ సంధ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సబ్బవరంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేశారు.

రేబిస్ నిర్మూలనకు కృషి

పెందుర్తి: రేబిస్ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్ మోహన్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా నిర్వహించిన యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పిల్లలను వాటికి దూరంగా ఉంచాలన్నారు. మొత్తం 300 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. పెంపుడు కుక్కలకు జీవీఎంసీ అందించిన లైసెన్సులు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ అధికారులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

• విద్యాశాఖ ఆర్జేడీ విజయ భాస్కర్



మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ భాస్కర్

విశాఖ విద్య: బోధనలో నైపుణ్యాలు మెరుగుపర్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చదువు చెప్పాలని విద్యాశాఖ ఆర్జేడీ బి. విజయ భాస్కర్ అన్నారు. గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లాలోని గణితం బోధించే ఉపాధ్యాయులకు శనివారం వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీ విజయ భాస్కర్ మాట్లాడుతూ గణితం అంటే విద్యార్థుల్లో లేనిపోని భయం ఉందని, ఇదో కష్టమైన సబ్జెక్టుగా భావిస్తున్నారన్నారు. కానీ సబ్జెక్టులో పట్టుసాధిస్తే గణితమే సులభమన్నారు. దీనిలోనే ఎక్కువ మార్కులు కూడా సాధించవచ్చన్నారు. సబ్జెక్టుపై పట్టుసాధించి బోధనలో మెలకువలను తెలుసుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. డీఈవో ఎల్. చంద్రకళ మాట్లాడుతూ సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులను ముందుగా గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ గణిత పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థుల తరపున ఆయా పాఠశాలల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం వై. వేణుగోపాల్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

లలితా పీఠంలో వారాహి నవరాత్రులు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు



వారాహి దేవి

సీతంపేట: లలితా నగర్ లలితా పీఠంలో వారాహి నవరాత్రులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆషాఢ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం వారాహిదేవికి సహస్ర నామార్చన చేశారు. అమ్మవారిని అలంకరించి దూప దీప నైవేద్యం సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ వారాహిదేవిని పూజించడం వల్ల కష్టాల నుంచి ఉపశమనం, మానసిక సమస్యల నుంచి విముక్తి, ఆరోగ్యం చేకూరుతాయన్నారు. ఈ నెల 10న శుద్ధ పంచమి సందర్భంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు వారాహి హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆనందాన్ని పంచిన సురభి నాటకాలు

ఏయూక్యాంపస్: నగరంలో వారం రోజులుగా జరిగిన సురభి నాటక ప్రదర్శనలు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని భానోదయ నాట్య మండలి అధినేత నాగ బాబు అన్నారు. శనివారం ఏయూ రంజనీ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ వేడుకల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు. రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో కళాభారతి వేదికగా ప్రదర్శించిన ప్రతీ నాటకాన్ని తిలకించడానికి విచ్చేసిన విశాఖవాసులకు, వారి ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖలో ఉచిత ప్రదర్శన ఇవ్వాలని తమ కుటుంబం అంతా నిర్ణయించుకున్నామని, దీనికి ప్రజల నుంచి సైతం మంచి స్పందన లభించిందన్నారు. బాదంగీర్ సాయి మాట్లాడుతూ ఇది విశాఖ ప్రజల విజయమన్నారు.